


# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## ఆ వాలుజడ

**'సంసారంలో సరిగమలు'** అనే శీర్షికకి ఈ కథ రాయచ్చో లేదో నాకు తెలీదు. నిజానికి ఇది కథ కాదు. ఒక యదార్ధ సంఘటన. 'వసుధైక కుటుంబం' అనుకుంటే మన కేన్వాస్ విస్తరిస్తుంది కాబట్టి ఈ కథ కాని కథ ఈ శీర్షికకి సరిపోవచ్చు. ఈ కథలో నేను కూడా ఉన్నాను కాబట్టి కథా సౌలభ్యం కోసం సంభాషణలు రాసాను. కానీ ఒక్క అబద్ధం కూడా రాయలేదు. అన్నీ నిజాలే. అవి మీకు చెప్పాలని నా తాపత్రయం. నచ్చితే సంతోషం. నచ్చకపోతే సారీ.

నేనూ, మావారు ఎస్ ఓ టిసి అనే సంస్థద్వారా విదేశీ ప్రయాణాలు చేస్తూంటాం. ఆయనకి ఉన్న ఏకైక వ్యసనం ఈ విదేశీయానమే. నాకు అప్పుడప్పుడూ కొంచెం కోపంగా ఉంటుంది. వారం పదిరోజుల ట్రిప్‌కి లక్షలు ఖర్చుపెట్టడం కంటే బోలెడు బంగారం కొనుక్కోవచ్చుగా అని. కానీ అది క్షణికమే. 'ఫలానా దేశం వెళదాం' అని ఆయన అనగానే, నేను సూట్‌కేస్ సర్దుకోవడం మొదలు పెడుతూంటాను.

ఇలా నేను వెళ్ళిన ఇరవై నాలుగుదేశాల ట్రిప్స్‌లో మా గ్రూప్‌లో తెలుగు వాళ్ళు బాగా అరుదు.

ఒకాయన మాత్రమే గ్రీస్ ట్రిప్‌లో హైదరాబాద్ నుంచి వచ్చారు. మిగిలిన వాళ్ళు దుబాయ్, కువైట్, అమెరికాలలో సెటిలైన ప్రవాసాంధ్రులు.

ఇక విషయానికి వస్తే అక్టోబర్ పదిహేడున మొదలయ్యే జోర్డాన్, ఈజిప్ట్ ట్రిప్‌ని మా ఇద్దరికీ బుక్ చేసుకున్నాం. మా పాస్ పోర్ట్‌లో ఈ రెండు దేశాల వీసాలు వేయకుండా కేవలం ప్రయాణీకుల లిస్ట్‌ని మాత్రమే మాకు ఇచ్చారు. జోర్డాన్ వీసా ఆన్ అరైవల్ అని, ఈజిప్ట్‌కి ఆ లిస్టే ఉన్న కాగితం సరిపోతుందని చెప్పారు. పదకొండురోజులు మాతో కలిసి ప్రయాణించే మాతోటి ప్రయాణీకుల జాబితాని చూసాను.

బోలెడు తెలుగు పేర్లు కనిపించాయి. అందరూ హైదరాబాద్ నించే. ఓ ఐదుగురు రెడ్డిగార్లు సింగిల్‌గా వస్తున్నారు. మరో ముగ్గురు ఒకే కుటుంబానికి చెందినవారు. మేమిద్దరం. మొత్తం పదిమంది తెలుగువాళ్ళం.

బాంబే ఏర్ పోర్ట్‌లోనే రెడ్డిగార్లతో పరిచయమైంది. వాళ్ళంతా తెలంగాణాలో మోతుబరి రైతులు. ఇంకా బిల్డర్స్. అందరికీ ఒకటి రెండు స్కూళ్ళు, ఒకటి రెండు కళ్యాణ మండపాలు, తలా ఓ సినిమా హాల్ ఉన్నాయి. అందరూ కోటీశ్వరులని అర్ధమైంది. కాకపోతే వాళ్ళెవరికీ ఇంగ్లీష్ రాదు. మిగిలిన ముగ్గురు ఎవరో మాకు తెలియలేదు.

బాంబే నుంచి మేము వెళ్ళింది కువైట్ ఏర్‌లైన్స్‌లో. కువైట్‌లో మూడు గంటల వెయిటింగ్ తర్వాత జోర్డాన్‌లోని అమ్మన్ కి మరో ఫ్లయిట్‌లో వెళ్తాం. కువైట్ ఏర్‌పోర్ట్‌లో మా గేట్ దగ్గర లేచి ఉన్నప్పుడు ఆ కుటుంబం మాకు కనిపించింది. ఆయనకి డెబ్బై ఏళ్ళు, ఆవిడకి అరవై ఐదు పైన ఉండచ్చు. 36 ఏళ్ళ వాళ్ళబ్బాయి చెవుల్లో హెడ్ ఫోన్స్ పెట్టుకుని సెల్‌ఫోన్‌లోంచి పాటలు వింటున్నాడు.

"మీరు డాక్టర్ వేద్రాది కదా?" ఆయన్ని అడిగాను.

"అవును నువ్వు పద్మజా?" పేంట్ షర్ట్‌లోని ఆవిడ ఇంగ్లీష్‌లో అడిగింది.

"అవునండి. బాంబేలో అంతమందిలో మిమ్మల్ని గుర్తుపట్టలేకపోయాను. ఇక్కడ ఇండియన్స్ తక్కువ కాబట్టి, మీరు ముగ్గురే ఉన్నారు కాబట్టి మీరే అనుకున్నాను" నా డిటెక్షన్‌కి మురిసిపోయి చెప్పాను.

"కృష్ణమూర్తి, నువ్వు కాక ఇంకో ఐదుగురు ఉండాలి?" ఆవిడ మళ్ళీ ఇంగ్లీష్‌లో అడిగింది.

"వాళ్ళు అక్కడ కూర్చున్నారండి." నేను తెలుగులో చెప్పి అనుమానం వచ్చి ఇంగ్లీష్‌లో అడిగాను.

"మీరు తెలుగువాళ్ళు కాదాండి?"

"అవును. కానీ నాకు తెలుగు రాదు" ఆవిడ ఇంగ్లీష్‌లో చెప్పింది. ఆవిడపేరు యామిని. వాళ్ళబ్బాయి పేరు అజయ్. (మా ట్రిప్ మొత్తంలోనూ యామిని ఒక్క తెలుగు ముక్క మాట్లాడలేదు. ఆవిడ మాట్లాడిన సంభాషణలు తెలుగులో రాసాను అంతే. అవి ఇంగ్లీష్‌నుంచి యథాతథంగా చేసిన అనువాదం మాత్రమే. నా కల్పితం ఒక్కటి లేదు.)

యామినిని చూడగానే ఆకర్షించేది ఆమె జుట్టు. పైకి దువ్వి క్లిప్ పెట్టి వదిలేసింది. ఆవిడ మోకాళ్ళని దాటి కిందికి ఉంది ఆ పోనీటైల్. ఫ్లయిట్ టైం అవడంతో నేను బాత్‌రూంలోకి వెళ్ళి ఫ్రెష్ అయి వచ్చాను. ఆవిడకూడా తన నిడుపాటి జుట్టుని జడగా అల్లి దాన్ని తలచుట్టూ కిరీటంగా చుట్టి మధ్యలో పసుపు రంగులో ఉన్న ఓ ప్లాస్టిక్ పువ్వు క్లిప్‌ని పెట్టింది. అలాంటి హెయిర్ స్టయిల్‌ని నేనింతదాకా చూడలేదు. అంత పెద్దావిడ ఆ ప్లాస్టిక్ పువ్వుని పెట్టడం చూసి నవ్వొచ్చింది కూడా.

ఈజిప్ట్ వచ్చే లిస్ట్‌లో మొత్తం ముప్పై రెండు పేర్లున్నాయి. కానీ అందులో కేవల పద్నాలుగు మందిమి మాత్రమే జోర్డాన్ చూడటానికి బుక్ చేసుకున్నాం. మిగిలినవాళ్ళు మూడు రోజుల తర్వాత ఇండియాలోని వివిధప్రాంతాలనుంచి డైరెక్ట్‌గా కైరోకి వస్తారు. అంటే వాళ్ళ ట్రిప్ ఇరవైయవ తారీకున ప్రారంభమౌతుంది.

మేము పదిమందిమి కాక, బరేలీనుంచి వచ్చిన మరో కుటుంబం తల్లి, తండ్రి, మెడిసిన్ చదివే కూతురు, ఇంటర్ చదివే కొడుకు నలుగురు అమ్మన్ ఏర్‌పోర్ట్‌లో మమ్మల్ని కలిసారు. ఓ మినీవేన్‌లో హోటల్‌కి బయలుదేరాం. యామిని జడవిప్పి, జుట్టుని ఓ దులుపు దులిపి వదిలేసింది. ఆవిడ ముందు సీట్లో కూర్చున్న ఓ రెడ్డిగారికి ఆ జుట్టు కొసలు తగిలి ఆయన కొంచెం ఇబ్బందిగా కదిలారు.

బరేలీ కుటుంబంలోని తల్లి చందనకి దాదాపు నా వయసు ఉంటుంది. తను తన ఫేమిలీ గురించి చెప్పి మా గురించి అడిగింది.

యామిని చెప్పింది.

"మావారు వేద్రాది, డాక్టర్. మేము 1972లో యుకె వెళ్ళి లండన్‌లో సెటిలయ్యాం. వీడు మా అబ్బాయి అజయ్. స్టాక్ బ్రోకర్. మా అత్తగారికి బాలేదని నాలుగేళ్ళ క్రితం ఇండియా వచ్చాం. ఏడాది క్రితం ఆవిడ పోయారు. నవంబర్‌లో మళ్ళీ వెనక్కి లండన్ వెళ్ళిపోతున్నాం."

ఆవిడ తెలుగురాదని ఎందుకు చెప్పిందో నాకు అర్థమైంది. కానీ నాలుగేళ్ళు హైదరాబాద్‌లో తెలుగు మాట్లాడకుండా పనివాళ్ళతో ఎలా నెగ్గుకొచ్చిందో మాత్రం అర్థం కాలేదు.

మొత్తానికి నాకు యామిని నచ్చలేదు. ఆవిడ ప్రతీదాన్ని విమర్శిస్తూ మాట్లాడేది. ప్రతీది లండన్‌తో పోల్చేది. వాళ్ళది బ్రిటిష్ పాస్‌పోర్ట్ కాబట్టి ఎయిర్ పోర్ట్‌లో చాలా త్వరగా బయటకి వెళ్ళిపోయేవాళ్ళు. మేము క్యూలో నిలబడి దాదాపు అరగంటకి కానీ బయటకి వచ్చేవాళ్ళం కాదు. ఈలోగా ఆవిడ డ్యూటీ ఫ్రీ షాప్స్‌లో షాపింగ్ చేస్తూండేది. 'ఇండియన్ పాస్‌పోర్ట్ ఉంటే ఇంతే' అని మా మీద తెగ జాలిపడిపోయేది.

వేద్రాద్రిగారు చాలా మితభాషి. ఆయన అవసరమైతేనే మాట్లాడేవాళ్ళు. యామిని ఏం చెపితే అది వినేవారు. 'నో' అన్న మాట ఆయన నోటి నుంచి నేను వినలేదు. అజయ్ అసలు మాతో మాట్లాడలేదు

ఇక ఐదుగురు రెడ్డిగార్లు చాలా మంచివాళ్ళు. హాస్యప్రియులు. డబ్బున్నవాళ్ళై ఉండి కూడా చాలా నిగర్వంగా ఉన్నారు. ఎప్పుడూ జోక్స్ వేస్తూ సరదాగా ఉండేవాళ్ళు. నేను గుంటూరు జిల్లానుంచి, మావారు కృష్ణాజిల్లా నుంచి వచ్చిన వాళ్ళం. నేను మా వారికి చెప్పానుకూడా.

"మన వైపు ఈ మాత్రం డబ్బున్న వాళ్ళు చాలా గంభీరంగా, ఎదుటివారిని దూరం పెడుతూ, మనవంక చూసి నవ్వితే ఎక్కడ తమ సొమ్మంతా పోతుందో అన్నట్లుగా బిగుసుకుపోయి ఉంటారు. వీళ్ళు ఎంత బావున్నారో చూడండి." మనవాళ్ళు డబ్బువస్తే డబ్బులేని సొంత అన్నదమ్ముల్ని, అక్క చెల్లెళ్ళని కూడా పురుగుల్లా చూస్తారు.

"నువ్వు చెప్పేది నిజమే. తెలంగాణావాళ్ళు మనకన్నా మంచివాళ్ళు" ఆయన ఒప్పుకున్నారు.

సాధారణంగా లంచ్ టైంలో మేమిద్దరం, రెడ్డిగార్లు ఐదుగురు ఓ టేబుల్‌లో కూర్చునేవాళ్ళం. వేద్రాద్రిగారి కుటుంబం విడిగా, చందన కుటుంబం విడిగా కూర్చునేవాళ్ళు.

ఓ రోజు మా లంచ్ పూర్తయ్యాక బయటకి వచ్చాం. మాకంటే ముందే భోజనం చేసిన యామిని హోటల్ లాంజ్‌లో కూర్చుని ఉంది. ఆవిడ రాజేంద్ర రెడ్డిని విపరీతంగా తిడుతోంది. మనిషి ఆవేశంతో ఊగిపోతోంది. ఆవిడ ఎందుకు అరుస్తోందో అర్థంకాని ఆయన అయోమయంగా చూస్తున్నారు.

"ఏమైంది?" నేను కంగారుగా అడిగాను.

"స్కాండల్! చెయ్యి కడుక్కున్న వాడు తుడుచుకోవాలికదా? అదికూడా రాదు. ఇక్కడికి వచ్చి చేతిని విదిలించాడు. నా జుట్టుమీద ఆ డ్రాప్స్ పడ్డాయి. జుట్టంతా పాడైపోయింది. రూంకి వెళ్ళగానే తలస్నానం చేయాలి. ఇడియట్. ఏళ్ళు వచ్చాయి కానీ బుద్దిరాలేదు.." ఆవిడ వెళ్ళి వేన్‌లో కూర్చుంది.

ఇంగ్లీష్ రాని ఒక్కకారణంగా ఆ కోటీశ్వరుడు అవన్నీ సహనంగా విన్నాడు. ఆవిడ వెళ్ళగానే నన్ను అడిగాడు.

"ఏందమ్మా. ఆమేమంటోంది?"

"మీరు చెయ్యికడుక్కున్నాక తుడుచుకోకుండా విదిలించారుట. ఆ తుంపర్లు ఆవిడ తలమీద పడి జుట్టంతా పాడైపోయిందిట. వెళ్ళి తలస్నానం చేయాలి అంటోంది" చెప్పాను.

"ఏందీ?" ఆయన ఆశ్చర్యపోయాడు.

ఇంతలో మావారు, మిగిలిన నలుగురు వచ్చారు.

"ఏంటి ఏమైంది?"" ఆయన అడిగారు.

"ఆ జుట్టామెతో ఒకటే లొల్లిసార్" రాజేంద్ర రెడ్డి చెప్పాడు.

"జుట్టామె ఎవరు? అందరికీ జుట్టుంది" ఆయన చెప్పారు.

"యామిని గారండి" జరిగింది చెప్పాను నవ్వాపుకుంటూ.

జుట్టామె అనే పదప్రయోగం నాకు తెగ నచ్చింది.

వేన్‌లో యామిని, చందన కబుర్లు చెప్పుకుంటూ ఉండేవాళ్ళు. సాధారణంగా అవన్నీ షాపింగ్‌కి సంబంధించినవే. ఏ బ్రాండ్‌కి చెందిన ఏ వస్తువు బావుంటుంది లాంటివి మాట్లాడుకునేవాళ్ళు. ఓసారి చందన నన్ను అడిగింది.

"పద్మజా నీకు షాపింగ్ ఇంట్రెస్ట్ ఉందా?"

"తనకి కేవలం హేండ్ బేగ్స్ కొనడం అంటేనే ఇష్టం. దాదాపు ముప్పై బేగ్స్ పైనే ఉన్నా, ఎక్కడికి వెళ్ళినా హేండ్ బేగ్స్ ఉన్నాయా అని చూస్తూంటుంది" మావారు చెప్పారు.

ఆ రాత్రి డిన్నర్ టైంలో యామిని నా బేగ్‌ని చూసి అడిగింది.

"నీకు ముప్పై హేండ్ బేగ్స్ పైనే ఉన్నాయని కృష్ణమూర్తి చెప్పాడు. మరి ఇంత చెత్త బేగ్ తెచ్చావేంటి? ముప్పై చెత్త హేండ్ బేగ్సేనా?"

నేను ఆ ప్రశ్నకి దిమ్మెరపోయాను. అతి చిన్న పరిచయంతో ఆవిడ నన్ను హర్ట్ చేసే ఆ ప్రశ్న ఎలా వేయగలిగిందో నాకు అర్థంకాలేదు.

"అవును. అన్ని ఇలాంటివే. ఇది నా కలెక్షన్‌లో ది బెస్ట్" చెప్పాను.

ఆవిడ మీద నా అయిష్టత ఇంకా పెరిగింది.

డెడ్ సీ దగ్గరకి వెళ్ళగానే యామిని, చందన, చందన కూతురు అంతా స్విమ్ సూట్స్ వేసుకుని షవర్ కేప్స్ పెట్టుకుని నీళ్ళల్లోకి దిగారు. నాకు మొహమాటం, సిగ్గు కాబట్టి నేను నైట్ డ్రెస్ - పైజమా, టీ షర్ట్ వేసుకుని వాళ్ళ వెనకే వెళ్ళాను. ఐతే నేను చాలా మూర్ఖంగా, అజ్ఞానంగా డెడ్‌సీలో మునగరు, తేలుతారు అనే నమ్మకంతో వసుదేవుడు యమునా నదిలో నడిచినట్లు నడుచుకుంటూ వెళ్ళిపోయాను. అక్కడ చాలా లోతుగా ఉండి, పట్టు తప్పి నీళ్ళల్లో పడిపోయాను. నాకు ఈతరాదు. మునగడం, తేలడం మధ్య ఉయ్యాలలూగాను కొద్దిసేపు. కళ్ళల్లోకి, నోట్లోకి నీళ్ళు పోయి ఆ క్షారానికి మంటలు. చచ్చిపోయాననే అనుకున్నాను. యామిని చకచక ఈదుకుంటూ వచ్చి నన్ను వెల్లకిలా తిప్పి చెప్పింది.

"కొట్టుకోకు. కూల్‌గా పడుకో. తలని వెనక్కి ఆనించు."

ఉక్కిరి బిక్కిరైన నేను ఆవిడని పట్టుకుని ఒడ్డుకు వచ్చి చచ్చినా నీళ్ళల్లోకి రానని చెప్పాను. నన్ను చూసి హడలిపోయిన మావారు నీళ్ళల్లో దిగే ఆలోచన అర్జెంట్‌గా విరమించుకుని నా పక్కనే కూలబడ్డారు. కానీ యామిని ఊరుకోలేదు, "కృష్ణమూర్తీ! మళ్ళీ మీ ఇద్దరూ డెడ్‌సీకి వస్తారని నేనైతే అనుకోవడంలేదు. జీవితంలో ఒక్కసారే వచ్చే అవకాశం. పద్మజ అవివేకంగా నడుచుకుంటూ వెళ్ళిపోయింది. నిన్ను నేను తీసుకెళ్తానురా" అంటూ ఆయన చెయ్యి పటుకుని తీసుకెళ్ళి మొత్తానికి నీళ్ళల్లో పడుకోపెట్టింది. ఆ తర్వాత నన్ను చాలా భయపడిన నేను ససేమిరా రానన్నాను.

"పద్మజా! నేను స్విమ్మింగ్ ఛాంపియన్‌ని. నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డం. రా" నన్ను లాక్కుపోయి మావారి పక్కన పడుకోపెట్టింది.

సముద్రం నీరు ఎలర్జీ అని ఒడ్డునే ఉన్న వేద్రాద్రిగార్ని పిలిచి మమ్మల్ని ఫోటోలు తీయమంది. నీళ్ళ మీద శవాల్లా తేలుతున్న మమ్మల్ని ఆయన బోలెడు ఫోటోలు తీసారు. కొద్దిసేపటికి ఒళ్ళంతా మంటలు పుట్టడంతో బయటకి వచ్చి పక్కనే ఉన్న పబ్లిక్ షవర్స్ కింద నుంచున్నాం. యామిని షవర్ కేప్ పెట్టుకున్నా కూడా షవర్ కింద దాన్ని తీసేసి తలారా స్నానం చేయడం చూసి అడిగాను.

"నా జుట్టు తడిసింది కానీ మీ జుట్టు పొడిగానే ఉందిగా. మళ్ళీ ఎందుకు తలస్నానం?"

"ఏమో? ఒక్క చుక్క నీరు లోపలికి వెళ్ళినా నా జుట్టు పాడైపోతుంది. డెడ్‌సీ నీళ్ళల్లో ఉప్పు చాలా ఎక్కువని నీకు తెలుసుకదా?"

ఆవిడ దాదాపు గంటసేపు షవర్ కింద జుట్టుని రుద్ది రుద్ది స్నానం చేస్తూనే ఉంది.

అక్కడినించి వచ్చేప్పుడు పక్కనే ఉన్న బోర్డు మీద రాసి ఉన్నది చదివాను.

'ఈ తీరంలో లోతు ఎక్కువ. కోస్టల్ గార్డ్స్ డ్యూటీలో లేరు. టూరిస్ట్‌లు ఎవరి భద్రతని వాళ్ళే చూసుకోవాలి.'

నేను భయంతో వణికిపోయాను. వెనక్కి తిరిగిచూస్తే, జీవజాలం, అలలు లేకుండా నిశ్చలంగా ఉన్న డెడ్ సీ కనిపించింది.

నేను యామిని చెయ్యిపట్టుకుని చెప్పాను.

"మీరు నా ప్రాణదాత. చాలా థాంక్స్. మీరు తప్ప నన్నెవరూ పట్టించుకోలేదు."

"ఇందులో ఏముంది పద్మజా. రూంకి వెళ్ళగానే షాంపూతో తలస్నానం చెయ్యి. ఉత్త నీళ్ళతో వాష్ చేస్తే ఉపయోగం లేదు." చెప్పింది.

కైరో వెళ్ళడానికి అమ్మన్ ఏర్‌పోర్ట్‌లో వేచి ఉన్నప్పుడు యామిని చెప్పింది.

"పిరమిడ్స్ చూడటం నా కల. గ్రేట్ వాల్ ఆఫ్ చైనా, పిరమిడ్స్ ఈ రెండూ చూడాలని ఎప్పటినుంచో నా కోరిక. కిందటి నెల చైనా వెళ్ళాం. ఇప్పుడు కైరో. ఇంటర్నెట్‌లో చూసాను. మనం దిగే మూవెన్‌పిక్ హోటల్ రూం బాల్కనీలోంచి పిరమిడ్స్ కనిపిస్తాయట. నేను రాత్రంతా బాల్కనీలో కూర్చుని పిరమిడ్స్ చూస్తాను." కైరోలో మా గ్రూప్‌లోని మిగిలిన ఇండియన్స్ కలిసారు.

కానీ మూవెన్‌పిక్‌లో మాకు పిరమిడ్స్ కనిపించే వైపు రూమ్స్ ఇవ్వలేదు. కాటేజెస్ ఇచ్చారు. మేము మా కాటేజ్‌లోకి వెళ్ళి సామాను పెట్టి లాంజ్‌లోకి వచ్చాం. యామినిగారి సామాను అక్కడే ఉంది. వేద్రాద్రిగారు ఓ సోఫాలో కూర్చుని ఉన్నారు. మమ్మల్ని చూసి చెప్పారు.

"ఆ కాటేజ్ యామినికి నచ్చలేదు. రెసెప్షన్‌లో అడిగితే పిరమిడ్ వ్యూ ఉన్న రూమ్‌కి అదనంగా రోజుకి 180 డాలర్స్ కట్టాలి అని చెప్పారు. అజయ్ సింగిల్ రూంకి 120 డాలర్సట. అవి ఎలా ఉన్నాయో చూడడానికి అజయ్, యామిని వెళ్ళారు"

కొద్దిసేపటికి ఆయనకి 'రూమ్స్ బానే ఉన్నాయ'ని కాల్ వచ్చింది. సూట్‌కేస్‌లు తీసుకుని వెళ్ళిపోయారు.

అక్కడే కూర్చుని ఉన్న సంజీవరెడ్డి చెప్పారు.

"ఏమి లొల్లి పెట్టింది సార్ ఆమె! హోటల్ వాళ్ళని తిట్టింది. మన గైడ్‌ని తిట్టింది. డాక్టర్ గారు ఒక్కమాట అనలే. మహానుభావుడు."

ఆ సాయంత్రం పిరమిడ్స్ దగ్గర లైట్ అండ్ సౌండ్ షో కి వెళ్ళడానికి బస్ కోసం వేచి ఉన్నప్పుడు యామిని నాతో చెప్పింది.

"మేము రూమ్ మారాం. బాల్కనీలోంచి ఐదు పిరమిడ్స్ కనిపిస్తున్నాయి. ఇప్పటిదాకా అక్కడే కూర్చున్నాం."

"ఔనా? మూడు వందల డాలర్లు అదనంగా కట్టాలిట కదా?" అడిగాను.

"అవును. మనం ఇక్కడ ఉండేది మూడురోజులు. వెయ్యిడాలర్ల కన్నా తక్కువేకదా? మీరు ఆ కాటేజ్‌లోనే ఉన్నారా?" అడిగింది.

"అవునండి" చెప్పాను.

"మా పక్క రూమ్స్‌ల్ ఖాళీయే పద్మజా. ఆ కాటేజ్‌లో పందులు కూడా ఉండవు. మీరు మారిపోండి" సలహా ఇచ్చింది.

"పర్లేదండి. మాకు బానే ఉంది. అదీగాక 540 డాలర్లు అంటే మాకు కష్టం. పగలంతా తిరిగి ఏ రాత్రికో వస్తాం. మళ్ళీ పొద్దున్నే లేచి వెళ్తాం. ఇక పిరమిడ్స్‌ని ఏం చూస్తాం?"

నా మాటలు విని ఆవిడ మమ్మల్ని పురుగుల్ని చూసినట్లు చూసింది. ఆవిడ మాటలు విన్న చందన వాళ్ళు ఆ గదులని తీసుకున్నారు.

మర్నాడు అలెగ్జాండ్రియా వెళ్ళేప్పుడు ఆవిడ యథాప్రకారం జుట్టుని వదిలేసి, క్వీన్ ఎలిజబెత్‌లా తెల్లటి హేట్ పెట్టుకుంది. జుట్టు పొడవుగా ఉంది కాబట్టి కిందికి తాకి, వెనక కూర్చున్న రెడ్డిగారి కాలికింద పడింది.

ఇక ఆవిడ తోక తొక్కిన తాచులా లేచి, ఇంగ్లీష్‌లో ఉన్న తిట్లన్నీ తిట్టింది. ఆయన మొహం అవమానంతో ఎర్రబడింది. తర్వాత డాక్టర్ వేద్రాదితో చెప్పారు.

"ఆవిడ చాలా ఎక్కువ మాట్లాడుతున్నారు. కావాలని తొక్కలేదు కదా నేను."

వేద్రాది ఏమీ మాట్లాడలేదు. ఆ తర్వాత రెడ్డిగార్లు వాళ్ళని పూర్తిగా అవాయిడ్ చేసి వాళ్ళకి దూరంగా కూర్చోసాగారు.

మా ప్రయాణం ముగింపుకి వచ్చింది. మర్నాడు మేము ఇండియా ఫ్లయిట్ ఎక్కుతాం. ఆ రోజంతా పగలంతా లక్సర్‌లోని వేలీ ఆఫ్ కింగ్స్‌లో ఎండలో నడిచి నడిచి చాలా అలిసిపోయాం. సాయంత్రం కర్నాక్ టెంపుల్‌లో సౌండ్ అండ్ లైట్ షో ఐటనరీలోని మా చివరి ప్రోగ్రాం. 'నావల్ల కాదు. రాను' అని చెప్పాను. మావారు కూడా నాతో ఆగిపోయారు. గ్రూప్‌లోని కొంతమంది వెళ్ళారు. కొంతమంది మాలా వెళ్ళలేదు. యామిని, చందన వాళ్ళు వెళ్ళారు. భోజనాల టైం రాత్రి ఎనిమిదిన్నరకి. సౌండ్ అండ్ లైట్ షోకి వెళ్ళిన వాళ్ళంతా వచ్చేసారు.

"మీరు రాకుండా మంచిపని చేసారు. షో జరిగిన రెండున్నర గంటలూ నుంచునే ఉన్నాం" చందన చెప్పింది.

భోజనాల దగ్గర యథాప్రకారం మేము ఐదుగురుం ఒక రౌండ్ టేబుల్ ముందుకూర్చున్నాం. డాక్టర్ వేద్రాదిగారు అజయ్‌తో మా దగ్గరికి వచ్చి అడిగారు.

"మేము కూడా ఇక్కడ కూర్చోవచ్చా?"

"తప్పకుండా. యామినిగారేరి?" అడిగాను.

"తను బాగా అలిసిపోయింది. భోజనం కంటే విశ్రాంతి చాలా అవసరం పడుకుంది" చెప్పారు.

అజయ్ తనకి కావలసినవి ఓ ప్లేట్‌లో తెచ్చుకుని కూర్చున్నాడు. వేద్రాది కూడా రైస్ తెచ్చుకుని కూర్చున్నారు. గబగబ తింటున్న అజయ్ తలెత్తి సీలింగ్ చూసి 'ఎంతబావుందోకదా?' అని అడిగాడు.

మేమంతా పైకి చూసాం. నిజంగానే రంగు రంగుల లైట్లతో స్టేన్సిల్ గ్లాస్ పెయింటింగ్స్‌తో చాలా అందంగా ఉది.

"అవును నాన్నా. చాలా బావుంది" వేద్రాది చెప్పాడు.

"ఇంత అందమైన సీలింగ్ ఎక్కడా చూడలేదు. బావుందికదా?" అజయ్ మళ్ళా అడిగాడు.

"అవును స్టేన్సిల్ గ్లాస్ పెయింటింగ్స్‌తో చాలా బావుంది" వేద్రాది చెప్పాడు.

మాకు కొంచెం వింతగా అనిపించింది. రెండు నిమిషాల తర్వాత అజయ్ మళ్ళీ అడిగాడు.

"ఎంత బావుందో! చైనాలో మనం ఇలాంటిది చూడలేదు కదా?"

"లేదు. చూడలేదు. ఇది ది బెస్ట్" ఆయన ఓపికగా చెప్పాడు.

అజయ్ గబగబా తిని మరోసారి తండ్రిని ఏదో అడగబోతూంటే ఆయన చెప్పాడు.

"అమ్మ ఒక్కటే ఉందికదా, నువ్వు తినడం అయిపోతే రూం కి వెళ్ళు."

"ఓకే" అజయ్ వెళ్ళిపోయాడు.

"మీకు వాడి ప్రవర్తన విచిత్రంగా ఉంది కదా?" ఆయన అడిగాడు. మేమెవరం ఏమీ మాట్లాడలేదు.

"నిజానికి నేను కూడా చాలా అలసిపోయాను. కానీ మీతో మాట్లాడాలని లేని ఓపిక తెచ్చుకుని వచ్చాను." ఆయన భారంగా చెప్పాడు.

"అయ్యో! రెస్ట్ తీసుకోవాల్సింది. మనకి రేపు కువైట్ నాలుగ్గంటల వెయిటింగ్ ఉంది. అప్పుడు మాట్లాడుకునేవాళ్ళం" చెప్పాను.

"లేదమ్మా. అప్పుడు యామిని కూడా ఉంటుంది" మంచి నీళ్ళు తాగుతూ చెప్పారు. మేము ఆశ్చర్యపోయాం.

"మీకు యామిని ప్రవర్తన, జుట్టు పిచ్చి చికాగ్గా ఉన్నాయికదా? తను మీలో చాలామందిని హర్ట్ చేసిందని నాకు తెలుసు. తన తరఫున సారీ చెప్దామని"

"అయ్యో! అదేంటి సార్. దీనికి సారీ ఎందుకు? ఆడోళ్ళకి జుట్టుపిచ్చి ఉంటుంది.." వెంకటరెడ్డి తేల్చేసాడు.

"లేదులేదు. మీరు యామిని అంటే పీకలదాకా కోపం అని నాకు తెలుసు."

"అయ్యో! లేదండీ. తను నా ప్రాణదాత" నేను ఖండించాను.

ఆయన చిన్నగా నవ్వి మళ్ళీ చెప్పడం మొదలుపెట్టాడు.

"మా పెళ్ళయ్యాక 1972లో మేము లండన్ వెళ్ళి అక్కడే స్థిరపడిపోయాం. యామిని కొత్తల్లో కొంతకాలం వర్క్ చేసింది కానీ, జుట్టుకి సరైన పోషణ, సంరక్షణ ఉండటం లేదనే కారణంగా మానేసింది. అదీకాక ఆ రోజుల్లో యు.కెలో ఇండియన్స్ తక్కువ కాబట్టి తన జుట్టు బ్రిటిషర్స్‌కి ఆశ్చర్యంగా ఉండేది. ప్రతీవాళ్ళు 'వావ్' అని మెచ్చుకునేవారు. తనకి దిష్టిపెడుతున్నారనే అనుమానం కూడా ఉండేది యామినికి. 1975లో మాకు సుజయ్ పుట్టాడు."

"ఆయన పేరు అజయ్ కదా?" రాజేంద్ర రెడ్డి అడిగాడు.

"అజయ్ మా చిన్నబ్బాయ్. సుజయ్ పెద్దవాడు. వాడు కేంబ్రిడ్జ్‌లో మెడిసిన్ చదివాడు" ఆయన ఓ నిమిషం ఆగాడు.

"నిజానికి మాకు ఏ కష్టాలు లేవు - నాలుగేళ్ళ క్రితంవరకు. నేను పేరున్న హాస్పిటల్‌లో డాక్టర్‌గా పనిచేసేవాడిని. సుజయ్ ఆర్థోపెడిక్ డాక్టర్‌గా ప్రాక్టీస్ చేసేవాడు. అజయ్ ఆ సంవత్సరమే మెడిసిన్‌లో చేరాడు. యామిని చాలా ఏక్టివ్‌గా ఉండేది. తనకి స్నేహ బృందం చాలా ఎక్కువ. స్టోన్ హెంజ్‌కి వెళ్ళేదారిలో మాకో పెద్ద ఇల్లుంది. కలిసి గార్డెనింగ్ చేసేవాళ్ళం. కలిసి వాక్‌కి వెళ్ళేవాళ్ళం. మా పిల్లలు చాల బుద్ధిమంతులు. వాళ్ళ వల్ల మాకు ఏనాడు ఎలాంటి ఇబ్బంది కలగలేదు..."

"ఒక్క నిమిషం డాక్టర్ గారు. అజయ్ స్టాక్ బ్రోకర్ కదా?" సంజీవరెడ్డి మా అందరి మనసుల్లోని సందేహాన్ని బయటకి వ్యక్తం చేసాడు.

"చెప్తాను... సుజయ్ ఆక్యుపంక్చర్ నేర్చుకోడానికి చైనా వెళ్ళాడు. మూడు వారాల తర్వాత ఓ చైనీస్ అమ్మాయితో వచ్చాడు. ఆ పిల్లవాడు ఆక్యుపంక్చర్ నేర్చుకునే హాస్పిటల్‌లో నర్స్. ఆమెని పెళ్ళిచేసుకుని తీసుకువచ్చాడు వాడు."

"అయ్యో!" అసంకల్పితంగా చెప్పాను.

"మూడువారాల్లో పెళ్ళి చేసుకునేంత ప్రేమేంది?" వెంకటరెడ్డి నిరసనగా చెప్పాడు.

"అది యామినికి పెద్ద షాక్. మాకాలనీలో నాలుగిళ్ళ అవతల ఓ చైనీస్ కుటుంబం ఉండేది. వాళ్ళ ఫ్రంట్ యార్డ్ అంతా చెత్తగా ఉండేది. లాన్ ఓ పద్ధతి లేకుండా ఉండేది. పిచ్చి మొక్కలు విచ్చలవిడిగా పెరిగేవి. మేము వాక్‌కి వెళ్ళి వచ్చేప్పుడు యామిని ఆ ఇంటివైపు చూసి ప్రతీసారి 'చైనీస్ ఆర్ డర్టీ' అనేది. కానీ ఏకంగా ఓ చైనా అమ్మాయి, అందులో నర్స్ తన ఇంటికి కోడలుగా వచ్చిందన్న విషయం ఆమె జీర్ణించుకోలేకపోయింది. అదీకాక తన స్నేహితురాలి కూతురిని సుజయ్ కిచ్చి చేయాలని తను చాలా అనుకునేది. ఆ అమ్మాయి మాంచెస్టర్‌లో అనస్తటిస్ట్‌గా పనిచేసేది, దాంతో వాళ్ళని తన ఇంట్లోకి అనుమతించనని గట్టిగా చెప్పింది. నేను సుజయ్‌కి ఓ ఇల్లు కొనిచ్చాను. వాళ్ళిద్దరూ అందులోకి మారిపోయారు. ఈ రోజుకీ మా అబ్బాయితో తప్ప ఆ అమ్మాయితో మేం మాట్లాడం. ఆ అమ్మాయికూడా మాతో మాట్లాడదు. కాకపోతే వాళ్ళిద్దరూ అన్యోన్యంగానే ఉన్నారు. దాదాపు ఆర్నెల్లపాటు యామిని ఏడుస్తూనే ఉంది. తను ఈ విషయం జీర్ణించుకోలేకపోయింది. ఆ తర్వాత దేవుడు మళ్ళీ ఇంకో దెబ్బకొట్టాడు. కోలుకోలేని దెబ్బ!" ఆయన మంచినీళ్ళు తాగి ఓ క్షణం ఆగి మళ్ళీ చెప్పసాగాడు.

"అప్పటిదాకా ఫస్ట్ మార్కులతో పాసవుతూ వచ్చి మెడిసిన్‌లో చేరి, ఫస్టియర్ కూడా మంచి మార్కులతో పాసైన అజయ్ ఇక చదవను అని వెనక్కి వచ్చేసాడు. వాడు వెనక్కి వచ్చాడన్న బాధతోపాటు వాడి ప్రవర్తనకి భయపడిపోయాం. ఒక మాటని పదేపదే చెప్పడం, ఎవరితో మాట్లాడకుండా వంటరిగా గడపడం, పెట్టినప్పుడు అమితంగా తినడం, పెట్టకపోతే అడగకపోవడం... ఏం చెయ్యాలో తోచక మేము తల్లడిల్లిపోయాం. అంత క్లవర్ అలా మారటానికి కారణం ఏంటో డాక్టర్లు చెప్పలేకపోయారు. కానీ అంతా కలిసి నిర్ధారించిన విషయం, మెడికల్ స్కూల్‌లో జరిగిన ఏదో సంఘటన వల్ల అజయ్ అలా తయారయ్యాడు. అదేంటో తెలిస్తే కానీ ట్రీట్‌మెంట్ చేయలేరు. అజయ్ చెప్పలేడు." వేద్రాది దీర్ఘంగా నిట్టూర్చాడు.

"అదే సమయంలో ఇండియాలో ఉన్న మా అమ్మకి ఆరోగ్యం పాడైంది. ఏకైక కొడుకుగా ఆవిడని చూడాల్సిన బాధ్యత నాదే కాబట్టి, ఇండియా వెళ్ళి ఆవిడ ఉన్నంత కాలం ఉండి వస్తానని యామినికి చెప్పాను. పిల్లల వ్యవహారంలో అలిసిపోయిన యామిని తనూ వస్తానంది. అజయ్‌ని తీసుకుని ఇండియాకే వచ్చేసాం. పిల్లల గురించి మాట్లాడటం ఇష్టంలేని యామిని ఇంగ్లీష్ తప్ప తెలుగులో మాట్లాడటం మానేసింది. దాంతో ఆవిడకి గర్వం అని అంతా దూరంగా ఉంచారు. ఇన్ని బాధలు పడుతున్నా తన జుట్టు పిచ్చి మాత్రం పోలేదు. దాని పోషణకి రోజుకి రెండు మూడు గంటలు కేటాయిస్తూనే ఉంది. ఏడాది క్రితం తొంభై రెండేళ్ళ వయసులో మా అమ్మ వెళ్ళిపోయింది. ఇక మమ్మల్ని వెనక్కి రమ్మని, అజయ్ ఆరోగ్యం గురించి శ్రద్ధ తీసుకుందామని సుజయ్ ఒకటే గొడవ చేయడం మొదలుపెట్టాడు. అజయ్ కోసం యామిని లండన్ రావడానికి ఒప్పుకుంది.."

ఆయన మరోసారి మంచి నీళ్ళు తాగి చెప్పడం కొనసాగించాడు.

"మేము ప్రతీ సంవత్సరం లాగానే లాస్టియర్ కూడా కంప్లీట్ హెల్త్ చెకప్ చేయించుకున్నాం. మా ఇద్దరి ఆరోగ్యాలు దెబ్బతిన్నాయి. నాకు ప్రోస్టేట్ కేన్సర్ వచ్చింది. యామిని ఊపిరితిత్తులు గట్టిపడ్డాయి."

"అయ్యో పాపం!" సంజీవరెడ్డి చెప్పాడు.

"మనిషి లంగ్స్ మెత్తగా స్పాంజ్‌లా ఉంటాయి. గాలి పీల్చుకుని వదిలేప్పుడు.." ఆయన చెప్తూండగానే రాజేంద్ర రెడ్డి అందుకుని చెప్పాడు.

"గట్టిపడితే ఊపిరాడ్డం కష్టం. సినిమా మొదట్లో చూపిస్తూంటారు. తెలుసు. సిగరెట్ తాగే వాళ్ళకి అలా అవుతుందిట"

"యామిని స్మోక్ చెయ్యదు. మరి అలా ఎందుకైందో అర్థం కాలేదు. రిపోర్ట్స్ అన్నీ సుజయ్‌కి పంపించి నేను కీమోథెరపీ చేయించుకున్నాను. అది నా విషయంలో లాంగ్ ప్రాసెస్ అయింది. చివరికి ఒక మేజర్ ఆపరేషన్‌తో నేను ప్రస్తుతం కేన్సర్ నుంచి విముక్తి పొందాను. మూడు నెలల క్రితం సుజయ్ మళ్ళీ ఇంకో పిడుగులాంటి మాట చెప్పాడు. యామినికి లంగ్ కేన్సర్! ఒక లంగ్‌ని తినేసి అది

వెన్నెముక వైపు పాకుతోందని అర్జెంట్‌గా లండన్ వచ్చేయమని కోరాడు. భగవంతుడు ఇలా దెబ్బమీద దెబ్బ ఎందుకు కొడుతున్నాడో అర్థం కాలేదు. వెల్త్ రీత్యా మాకు చాలా డబ్బుంది. కానీ హెల్త్ విషయంలో దేవుడు చిన్నచూపు చూసాడు."

"అయ్యయ్యో!" అంతా దాదాపు ఒకేసారి అన్నాం.

"యామిని కీమోకి మొదట్లో ససేమిరా ఒప్పుకోలేదు. కానీ ప్రాణం కంటే ఏదీ ఎక్కువకాదు కాబట్టి తప్పని సరై ఒప్పుకుంది. కారణం కీమోకి జుట్టు ఊడిపోతుందని! ఇప్పుడా ఊడిపోయే జుట్టుకి పోషణ ఎక్కువ చేసింది. రోజులో కనీసం నాలుగు గంటలు అదేపని."

"ఆమెని మేము అపార్థం చేసుకున్నాం డాక్టర్ గారూ." వెంకటరెడ్డి విచారంగా చెప్పాడు.

"రెండు నెలలక్రితం సుజయ్ ఇంకో దుర్వార్త చెప్పాడు. యామినికి వచ్చిన కేన్సర్ త్వరగా వ్యాపించే లక్షణం కలది. కాబట్టి ఆమె ఇంకో ఆర్నెల్లు లేదా ఏడాది కంటే బతికే అవకాశం లేదని వాడు చెప్పాడు."

బుగ్గల మీద కారే కన్నీళ్ళని ఆయన నేప్కిన్‌తో తుడుచుకున్నాడు.

"ఆ విషయం మాత్రం యామినికి చెప్పొద్దని వాడ్ని రిక్వెస్ట్ చేసాను. మరి అలాంటప్పుడు ఈ రేడియేషన్స్ అవీ ఎందుకు, అమ్మకి జుట్టుమీద ఉన్న ప్రేమ తెలుసుకదా, అదీకాక మనిషి నరకం అనుభవిస్తుంది అని చెప్పాను. వాడు ఒప్పుకోలేదు. 'ఏమో నాన్నా ఆర్నెల్లలో మంచి మందులు రావచ్చుగా. రేడియేషన్ లేకపోతే ఇంకా స్ప్రెడ్ అవుతుంది కదా' అంటాడు. యామిని రోజుకి రెండుసార్లు వాడు ఫోన్ చేసినప్పుడల్లా రాలిపోయే జుట్టూ మళ్ళీ ఎన్నిరోజులకి పెరుగుతుంది, మళ్ళీ ఇంత పొడవు వస్తుందా అని అడుగుతూంటుంది" ఆయన చెప్పేసి ఆపేసారు.

మాకు ఏం మాట్లాడాలో తెలియలేదు. జుట్టుని రకరకాలుగా మడుస్తూ రకరకాల క్లిప్స్, హేట్స్ పెట్టుకుంటూ, అందర్నీ తిడుతూండే యామిని మరో ఏడాదిలో మరణిస్తోంది అన్న భావనే మాకు గొంతు పట్టేసినట్లుగా ఉంది.

"తనకి చైనా, ఈజిప్ట్ చూడాలని కోరిక. అందుకే కిందటి నెల చైనా వెళ్ళాం. ఇప్పుడు ఈజిప్ట్. నిజానికి మేము 1973లో ఈజిప్ట్ వచ్చాం హనీమూన్‌లాగా. గింజాలోని ఓ హోటల్‌లో దిగాం. ఆ హోటల్ బాల్కనీలోంచి చూస్తే పిరమిడ్స్ కనిపించేవి. తర్వాత యామిని అనేకసార్లు నాతో అంది, 'మనం మళ్ళీ ఈజిప్ట్ వెళ్దాం, పిరమిడ్స్ చూద్దాం' అని. మా వాడు త్వరగా రమ్మని గొడవపెడుతున్నా తనకి చివరిసారిగా ఈజిప్ట్ చూపిద్దామని తీసుకొచ్చాను. మాకున్న డబ్బుకి మేమే స్వంతంగా వచ్చి, చూసి వెళ్ళచ్చు. కానీ ఇంట్లో ముగ్గురమే, దుఃఖంగా, విచారంగా గడుపుతున్నాం. గ్రూప్ టూర్ అంటే చాలామంది ఉంటారు, సరదాగా ఉంటుందని మీ గ్రూప్‌తో వచ్చాం. కానీ తను చాలామందికి శత్రువైంది. యామిని నిజానికి చాలా స్వీట్ పర్సన్. ఈ ఎదురు దెబ్బలకి తను చాలా నెగెటివ్‌గా మారిపోయింది. పైకి అనకపోయినా కేన్సర్ అంటే తగ్గే జబ్బుకాదని యామినికి తెలుసు. మా తర్వాత పసిపిల్లాడిలాంటి అజయ్ గతి ఏమిటి? అనే ఆలోచనతో తను చాలా బాధపడుతోంది. 'చైనా కోడలితో రాజీపడితే అజయ్‌ని చూసుకుంటుందా?' అని అడిగింది నన్ను. నీకేం కాదు తగ్గిపోయింది. వాడు మామూలు మనిషి అయ్యేదాకా మనమే చూసుకుందాం అని చెప్తూంటాను."

ఆయన లేచి మా అందరికీ చేతులు జోడించి చెప్పాడు. "దయచేసి యామినిని అసహ్యించుకోకండి. కోపగించుకోకండి. ఇవన్నీ మీకు చెప్పానని తనకి తెలియనివ్వకండి. వస్తా."

లక్సర్ ఎయిర్ పోర్ట్‌లో యామిని బెంగుళూర్ నుంచి వచ్చిన అంకితని ఒకటే తిడుతోంది. ఈవిడ సెక్యూరిటీ చెక్‌లో వంగి తన సూట్ కేస్‌ని స్కానర్ మీద పెడుతుంటే, అంకిత చూసుకోకుండా ఆవిడ జడమీద తన సూట్ కేస్ పెట్టిందట.

"కుదిరితే కువైట్‌లో తలస్నానం చేయాలి పద్మజ. ఆ సూట్ కేస్‌ని ఎక్కడెక్కడ పెట్టిందో ఏమో" నాతో చెప్పింది.

"షాంపూ లేదుకదండి. లిక్విడ్స్ ఒప్పుకోరని బుక్‌డ్ లగేజ్‌లో పెడతాంగా?" అడిగాను.

"మేము మీలా మిడిల్ క్లాస్ కాదు పద్మజా. నేను కువైట్ ఏర్ పోర్ట్‌లో షాంపూ కొనుక్కుంటాను. ఓ వందడాలర్లుంటుందేమో. అంతేకదా?"

జుట్టు కొసలని పేపర్ నేప్కిన్‌తో తుడుస్తూ యామిని కఠినంగా చెప్పింది.

ఈసారి ఆవిడ మీద నాకు కోపం రాలేదు.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

**Click here to share your comments on this story**